క్లుప్తంగా

ఎరువుల దుకాణాల తనిఖీ



బూర్జలో పురుగు మందుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏవో అవినాష్

సీతానగరం: మండలంలో ఎరువులు, క్రిమి సంహారక మందుల దుకాణాలను ఏవో ఎస్.అవినాష్ శనివారం తనిఖీ చేశారు. బూర్జ, సీతానగరం గ్రామాల్లో ఉన్న ఎరువులు, క్రిమి సంహారక మందుల దుకాణాల్లో విక్రయిస్తున్న క్రిమి సంహారక మందుల నుంచి శాంపిల్స్‌ను తీసి నాణ్యతా ప్రమాణాలను పరిశీలనకు పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులు, క్రిమి సంహారక మందులను విక్రయించాలని సూచించారు. అన్నదాతకు అండగా నిలవాలని కోరారు. ఆయన వెంట వ్యవసాయ సహాయకులు, డీలర్లు ఉన్నారు.

వెలగని సెంటర్ లైటింగ్



చీకట్లో ఉన్న బంధం వారి వీధి

పార్వతీపురం: పార్వతీపురం ప్రధాన రహదారి బంధం వారి వీధిలో గడచిన కొద్ది రోజుల నుండి సెంటర్ లైటింగ్ వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లైట్లు వెలగకపోవడంతో అంధకారంలోనే భారీ వాహనాలు, పాదచారులు, రాకపోకలు చేస్తున్నారు. విద్యుత్ సమస్యపై అధికారులకు తెలియజేసినప్పటికీ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తక్షణమే సెంటర్ లైటింగ్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ట్రాక్టర్ డ్రైవర్లకు అవగాహన



ట్రాక్టర్ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో సూర్యనారాయణ

మక్కువ: మండలంలోని అన్ని పంచాయతీల పరిధిలో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రహదారులపై ఐరన్ వీల్స్‌తో ట్రాక్టర్లను నడపవద్దని ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణ తెలిపారు. ఈ మేరకు మండలంలోని మేళాపువలసలో దమ్ము చేస్తున్న ట్రాక్టర్ల డ్రైవర్లకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐరన్ వీల్స్‌తో రాకపోకలు సాగించడం వల్ల లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన రోడ్లు పాడవుతున్నాయని చెప్పారు. దమ్ము అయిన తర్వాత ఐరన్ వీల్స్ తీసేసి సాధారణ టైర్లతో మాత్రమే రాకపోకలు సాగించాలని సూచించారు.

మాతా, శిశు మరణాలు తగ్గించాలి

జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు



లబ్ధిదారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న మావుడి సోదరులు

మక్కువ: మాతా, శిశు మరణాలు తగ్గించేందుకు ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా పౌష్టికాహారం అందిస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.రాజశ్రీ, ఎన్.లీలావతి ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కలు సిద్ధం



రోడ్డుకిరువైపులా నాటడానికి తరలిస్తున్న మొక్కలు

సీతానగరం: మండలంలోని జోగింపేట నుండి ఇప్పలవలస బీటీ రోడ్డుకు ఇరు వైపులా ఉపాధి హామీ పథకం ద్వారా నీడ నిచ్చే మొక్కలు నాటడానికి సిద్ధం చేసినట్లు ఉపాధి హామీ పథకం ఏపీవో భాను తెలిపారు. జోగింపేట – ఇప్పలవలస గ్రామాల మధ్య వేసిన మొక్కలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు మొక్కలు నాటడానికి అనుకూలమైన వాతావరణం కావడంతో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటడం వలన వాహన చోదకులకు, పొలం పనుల కోసం వెళ్లి వారికి నీడనిస్తాయన్నారు. అవసరం మేరకు మొక్కలు తరలించారు.

ప్రజారోగ్యానికి భరోసా కల్పించండి

● ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట:

గ్రామాల్లో ప్రజల ఆరోగ్యంపై వైద్యశాఖ ప్రత్యేక శ్రద్ధ కనబరిచి వారికి ఆరోగ్య భరోసా కల్పించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. చిలకలపల్లిలో వైద్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని, ప్రత్యేక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. వైద్యశాఖ సిబ్బంది గ్రామాల్లో ఇంటింటా తిరిగి రోగులను గుర్తించి వారికి అవసరమైన సేవలు అందించాలన్నారు.

సర్వే నిర్వహించి దాని ద్వారా చికిత్సలు అందించడం వలన ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉండవన్నారు. రానున్న మూడు నెలల్లో వైరల్ జ్వరాలు, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు సోకకుండా ముందస్తుగా పర్యవేక్షణలు ఉండాలని సూచించారు. స్థానికంగా సమస్య పరిష్కరించలేని పక్షంలో అటువంటి వారిని పెద్ద ఆస్పత్రులకు రిఫర్ చేయాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ సేవలను మరింత విస్తృతం చేయాలని సూచించారు. ప్రజలకు దానిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్మోహన్‌రావు మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ నుండి 12వ తేదీ వరకు నిర్వహించనున్న మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. 10వ తేదీన జరగబోయే డీవార్మింగ్ డే కార్యక్రమానికి ముందస్తు చర్యలు చేపట్టి విజయవంతం చేయాలన్నారు. ఉచిత వైద్య శిబిరంలో 75 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరరావు, ఎంపీపీ నాగమణి, జడ్పీటీసీ ఎ.రవికుమార్, ఉపాధ్యక్షుడు సాయిరాం, మండల పార్టీ అధ్యక్షుడు మురళీకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు పకీరునాయుడు, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, సర్పంచ్ ఎన్.పాపారావు, ఎంపీడీవో విజయలక్ష్మి, వైద్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాతున్న ఎమ్మెల్యే జోగారావు

అర్హతే ప్రామాణికం



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

● గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి రాజన్నదొర

పాచిపెంట: రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని పాచిపెంట పంచాయతీ అన్నంరాజుపేట, కునాంబందవలస, గార్లవలస, గడివలస గ్రామాల్లో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. నాలుగేళ్లల్లో ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా కలిగిన లబ్ధిని వివరించే బుక్‌లెట్‌ను అందజేశారు. అలాగే ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం అన్నంరాజుపేట పాఠశాల విద్యార్థితో కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డోల బాబ్జీ, మాజీ వైస్ ఎంపీపీ తట్టికాయల గౌరీశ్వరరావు, కూరాకుల కార్పొరేషన్ డైరెక్టర్ కొత్తమామిడి పార్వతి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ

బలిజిపేట: ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ రైతులకు నవధాన్యాల కిట్లను చిలకలపల్లిలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు శనివారం పంపిణీ చేశారు. ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ యోజన పథకం కింద మండలంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 52మందికి వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేర రైతు సాధికారిత సంస్థ నియోజకవర్గ స్థాయిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ రైతులకు వీటిని పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఒకొక్క కిట్టు రూ.10వేలు విలువ కాగా రాయితీతో సరఫరా చేయడం జరిగిందన్నారు. జొన్నలు, మొక్కజొన్న, జీలుగులు, పిల్లిపెసర, జనుములు, రాగి, కొర్ర, సజ్జ, పొద్దుతిరుగుడు, మినుములు, పెసలు, కందులు, కిచెన్‌గార్డెన్ కిట్టు ఉన్నాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాగుచేసే ప్రతీ రైతు పది సెంట్ల భూమిలో ప్రకృతి వ్యవసాయాన్ని చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ విస్తీర్ణాన్ని పెంచాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరరావు, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, మండల పార్టీ అధ్యక్షుడు మురళీకృష్ణ, ఏవో శ్రావణ్, పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.



చిలకలపల్లిలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

భూసర్వే పరిశీలన

సీతానగరం: మండలంలో జరుగుతున్న భూముల రీసర్వేను తహసీల్దార్ ఎన్వీ రమణ పరిశీలించారు. బక్కుపేట, ఎస్ఎస్ పురం గ్రామాల్లో సర్వే రాళ్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సర్వేయర్లు, వీఆర్‌వోలకు పలు సూచనలు చేశారు. వందేళ్ల తరువాత జరుగుతున్న రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. రానున్న రోజుల్లో ఎటువంటి వివాదాలకు తావు లేకుండా ఉండేందుకు ఉపయోగపడుతుందన్నారు. సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు. సచివాలయ సర్వేయర్లు, వీఆర్‌వోలు, రైతులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సారా స్వాధీనం

పార్వతీపురం: మండలంలోని అడ్డూరువలస వద్ద నిర్వహించిన దాడులలో 160 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ వై.సింహచలం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు నిర్వహించిన దాడులలో ఒడిశా రాష్ట్రం నుండి పార్వతీపురం పట్టణానికి తీసుకువస్తున్న వెలగాడ రవిచంద్రను అదుపులోకి తీసుకొని ఆయన వద్దనున్న 160 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చ



జరుగుతున్న సర్వసభ్య సమావేశం

సాలూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జి. రాములక్ష్మ అధ్యక్షతన, ఎంపీడీఓ రమాదేవి ఆధ్వర్యంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో చేపట్టిన, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంపై చర్చించారు. అలాగే పంచాయతీరాజ్, వైద్యారోగ్యశాఖ, వ్యవసాయ, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్, వైఎస్సార్‌క్రాంతి పథం, ఎలక్ట్రికల్, తదితర శాఖల వారీగా పనులపై ఆరా తీశారు. వైస్ ఎంపీపీలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణావతమ్మ, జిల్లా గ్రంథాలయాల చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

9 నుంచి విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక సదస్సులు

డొంకవర్తి: ఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు సర్కిళ్లలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సదస్సులు నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్మన్, విశ్రాంత జడ్జి బి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న విజయనగరం సర్కిల్‌లో పార్వతీపురం సబ్ డివిజన్‌కు సంబంధించి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై వినియోగదారులు ఫిర్యాదులు చేయవచ్చని చెప్పారు. విశాఖ సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న సీజీఆర్ఎఫ్ కార్యాలయానికి లిఖిత పూర్వకంగా కూడా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

అభివృద్ధి పనులు వేగవంతం

● ఎంపీపీ ప్రమీల

పాచిపెంట: వివిధ శాఖల ఆధ్వర్యంలో మంజూరైన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులను ఎంపీపీ బడ్నాన ప్రమీల కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా శాఖల వారీగా అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. విద్యుత్ శాఖ గురించి చర్చ జరిగినప్పుడు పలువురు గిరిజన గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో ఎప్పుడో ఏర్పాటు చేసిన ఐరన్ విద్యుత్ స్తంభాలను మార్చాలని కోరారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ, మండలానికి కోటీ 20 లక్షల రూపాయల ఉపాధి నిధులు మంజూరయ్యాయని, వెంటనే పనులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ జి.పార్వతి, వైస్ ఎంపీపీలు కొరిపల్లి రవీంద్ర, మీసాల నారాయణ, ఎంపీటీసీ సభ్యులు సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బడ్నాన ప్రమీల

ఎమ్మెల్యే పరామర్శ

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు మాస్టారును ఎమ్మెల్యే అలజంగి జోగారావు శనివారం పరామర్శించారు. చిరంజీవులు ఇటీవల స్వల్ప గుండెపోటు సమస్యకు గురై అత్యవసరంగా విశాఖపట్నం ఆస్పత్రిలో చేరి వైద్యం చేయించుకున్నారు. తిరిగి తన స్వగ్రామానికి విచ్చేసిన విషయాన్ని ఎమ్మెల్యే జోగారావు తెలుసుకుని కృష్ణపల్లి గ్రామానికి వెళ్లి చిరంజీవి మాస్టారును పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు ఉన్నారు.



మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు మాస్టారును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

'జగనన్న సురక్ష' విజయవంతం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

సాలూరు: మండలంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతమైందని ఎంపీపీ జి.రాములమ్మ, వైస్ ఎంపీపీలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతమ్మ, జిల్లా గ్రంథాలయాల చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, జేకేసీ కన్వీనర్ క్లోపల్లి త్రినాథలు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు 11 రకాల ధ్రువపత్రాలు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగస్వాములైన సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, అధికారులు, ప్రజలు, నాయకులు తదితరులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా, అవినీతిరహితంగా అత్యంత పారదర్శకంగా పాలన సాగిస్తున్న జగన్ మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పునుగు పిల్లి మృతిపై అటవీ శాఖ అధికారుల పరిశీలన

బలిజిపేట: బలిజిపేటలో పునుగు పిల్లి మృతి చెందడంతో జిల్లా అటవీ శాఖ అధికారులు పరిశీలించారు. బలిజిపేట చిన్నవీధిలో ఎ.రాజు పాత ఇంటి వద్ద పునుగు పిల్లులు ఉన్నట్లు సమాచారం. దీనిలో ఒకటి విద్యుత్ షాక్‌తో మృతి చెందడంతో జిల్లా అటవీ శాఖ రేంజి అధికారి త్రినాధరావు పరిశీలించారు. పాతబడిన ప్రదేశంలో అవి తిరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. వీటివలన ఎటువంటి హాని కలగలేదని, తరుచు పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. గత రెండు సంవత్సరాల నుండి వీటి ఉనికి ఇక్కడ ఉన్నట్టు అధికారులు గుర్తించారు. సాధారణంగా ఇవి శేషాచలం అడవుల్లో నివసిస్తుంటాయని తెలిపారు. మృతి చెందిన పిల్ల వయసు 3 నెలలు ఉంటుందని అంచనా. దీనిని మండల పశువైద్యాధికారి గణేష్ పోస్టుమార్టం చేసి అధికారుల సమక్షంలో ఖననం చేశారు. ప్రత్యేకాధికారి ఎం.మనోజ్, సిబ్బంది పాల్గొన్నారు.



మృతి చెందిన పునుగు పిల్లి

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

● ఎంపీపీ రవణమ్మ



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ రవణమ్మ, వ్యవసాయ పద్ధులను వివరిస్తున్న ఏవో అవినాష్

సీతానగరం: మండలంలో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి జరుగుతుందని ఎంపీపీ రవణమ్మ అన్నారు. గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి జీతాలు చెల్లించాలని అధికారులు మార్గదర్శకాలు విడుదల చేయడంపై రామవరం, జోగింపేట, కృష్ణారాయపురం గ్రామ సర్పంచ్‌లు అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బి.రవణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామాలకు నిధులు రాకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందని రామవరం సర్పంచ్ అన్నారు. చినబోగిలి, బక్కుపేట, గెడ్డలుప్పి, కొత్తవలస, లచ్చయ్యపేట, సుమిత్రాపురం సర్పంచ్‌లు జోక్యం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్న సురక్ష పేరుతో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరిస్తూ అభివృద్ధి పనులు మంజూరు చేశారన్నారు. అన్ని గ్రామాల్లో రోడ్ల అభివృద్ధి, కాలువలు, తాగునీటి పథకాల పనులు జరుగుతున్నాయని చెప్పారు. వెలుగు ఏపీఎం శ్రీరాములు మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి రూ.కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు సమకూర్చడం జరిగిందన్నారు త్వరలో అదనంగా చిరు వ్యాపారస్తులకు రూ.1.5కోట్ల చెల్లింపులు జరపనున్నట్టు వెల్లడించారు. ఏఈ చంద్రమౌళి మాట్లాడుతూ అన్ని గ్రామాలకు ఇప్పటి వరకు ఉన్న గోర్జిలను బీటీ రోడ్లుగా అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, వైద్యాధికారులు రాధాకాంత్, శిరీష, పశు వైద్యాధికారి రామారావు, ఐసీడీఎస్, వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు, విద్యాశాఖ, వెలుగు, ఉపాధి హామీ, అటవీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మిషన్ ఇంద్రధనుస్సు వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



మిషన్ ఇంద్రధనుస్సు వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సీతానగరం: మండలంలో జరగనున్న మిషన్ ఇంద్రధనుస్సు, డీవార్మింగ్ కార్యక్రమాల విజయవంతానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని ఎంపీపీ బి.రవణమ్మ, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సీతానగరం, పెదంకలాం, పీహెచ్‌సీల వైద్యాధికారులు వీటికి సంబంధించి సమకూర్చిన వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యాధికారులు చేస్తున్న బృహత్తర కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. వైద్యాధికారులు డాక్టర్ శిరీష, డాక్టర్ రాధాకాంత్ మాట్లాడుతూ మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమం ద్వారా అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల వయసు గల పిల్లలకు షెడ్యూల్ ప్రకారం వ్యాధి నిరోధక టీకాలు వేయాలన్నారు.

మండలంలో అన్ని పాఠశాలల విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు ఈ నెల 10న వేయనున్నట్టు తెలిపారు. ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్, ఎంఈవో 1, 2లు జి.సూరిదేముడు, ఎంవీ రమణ, ఐసీడీఎస్ అధికారులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

డీఈవోను కలిసిన ఎంఈవోల సంఘ నాయకులు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా ఎంఈవోల సంఘం నూతన కమిటీ నాయకులు డీఈవో ఎస్.ప్రేమకుమార్‌ను శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంఈవోల సంఘం జిల్లా నూతన కమిటీ సభ్యులను డీఈవోకు జిల్లా అధ్యక్షుడు సామల సింహాచలం పరిచయం చేశారు. విద్యాపరంగా పార్వతీపురం మన్యం జిల్లాను రాష్ట్ర స్థాయిలో ముందుకు తీసుకువెళ్లేందుకు ఎంఈవోలు కృషి చేయాలని డీఈవో సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వ పాఠశాలల్లో చక్కగా అమలు చేసేందుకు, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందే విధంగా తగిన కృషి చేస్తామని ఎంఈవోల సంఘం నేతలు డీఈవోకి తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.నాగభూషణరావు, గౌరవ అధ్యక్షుడు జె.నారాయణస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు మువ్వల వెంకటరమణ, ట్రెజరర్ ముదిలి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు కె.సోంబాబు, జనార్దన్, వై.విమల కుమారి, ఎ.శ్రీనివాసరావు, గౌరి నాయుడు, సతీష్, శ్యాంసుందర్, రాజ్‌కుమార్, కె.ప్రసాదరావు, కె.శ్రీనివాసరావు, కొండలరావు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



డీఈవోను మర్యాదపూర్వకంగా కలిసిన ఎంఈవోల సంఘ నాయకులు

మాదకద్రవ్యాలను నిర్మూలించాలి : డీఎంహెచ్‌వో



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగన్నాథరావు

పార్వతీపురం టౌన్: జిల్లాలో మాదక ద్రవ్యాలను నిర్మూలించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. బి.జగన్నాథరావు అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగ నియంత్రణపై కౌన్సిలర్లకు శిక్షణా కార్యక్రమం ఎన్‌జీవో హోమ్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగ నియంత్రణపై, జిల్లాలో డ్రగ్ వ్యసనంపై సర్వీసులను అందిస్తున్న కౌన్సిలర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శిక్షణలో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధులు, సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కె.కవిత, ఇన్‌చార్జ్ అడిషనల్ వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా.శ్యామ్‌కుమార్, ఇతర జిల్లా అధికారులు, మాస్టర్ ట్రైనర్ సూర్యప్రకాశరావు, సీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రాజు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పార్వతీపురం / సాలూరు
9010204441, 9951602891
Office mail : vzmadvt@gmail.com